

'ముడా'లో బలవంతపు చర్యలు వద్దు: హైకోర్టు

బెంగళూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా) ఇంటి స్థలాల అక్రమాల కేసులో దట్టగళ్ళిలోని భూమిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) స్వాధీనం చేసుకుంది. ఇందుకు సంబంధించి ఎటువంటి బలవంతపు చర్యలు తీసుకోరాదని ఈడీకి హైకోర్టు సూచించింది. విద్యారణ్యపురంలోని చాముండేశ్వరి నగర సర్వోదయ సంఘం కార్యదర్శి భోజరాజు సమర్పించిన అర్జీపై బుధవారం విచారణ జరిపారు. న్యాయమూర్తి సోమశేఖర్ నేతృత్వంలోని ధర్మాసనం మధ్యంతర తీర్పునిచ్చారు.



కేపీసీసీ కార్యాలయంలో మహాత్ముడి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీఎం సిద్దరామయ్య

గాంధీజీ పోరాట స్ఫూర్తితోనే దేశానికి స్వాతంత్ర్యం

- సుదీర్ఘ కాలం కాంగ్రెస్‌కు సేవలందించిన మహాత్ముడు : సీఎం సిద్దరామయ్య 7
- వర్ధంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నివాళి



డీసీఎం డీకే శివకుమార్ నివాళి..

బెంగళూరు ప్యాలెస్‌పై ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఓకే



బెంగళూరు ప్యాలెస్

బెంగళూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): బెంగళూరు ప్యాలెస్ మైదానం భూమి వినియోగానికి సంబంధించి ఆర్డినెన్స్ ద్వారా అవసరమైన స్థలాన్ని వాడుకోవడంతోపాటు నిర్దిష్ట రోడ్డు విస్తరణ చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అవకాశం లభించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆర్డినెన్స్‌కు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ బుధవారం అంగీకారం తెలిపారు. 427 ఎకరాలు 16 గుంటల విస్తీర్ణంలోని బెంగళూరు ప్యాలెస్ స్థల వినియోగం, నియంత్రణ అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లభించింది. గత రాష్ట్రమంత్రివర్గ భేటీలో టీడీఆర్ ఇవ్వరాదని ప్రభుత్వం తీర్మానించింది. ఇందుకు సంబంధించి గవర్నర్ ఆమోదం తెలిపారు. సుమారు 3వేల కోట్ల రూపాయల విలువైన బెంగళూరు ప్యాలెస్ భూమికి సంబంధించి టీడీఆర్ విషయంలో మైసూరు రాజమాత, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య వివాదం సాగుతోంది. దీనికి సంబంధించి సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయడానికి సంబంధించి కేబినెట్‌లో ఆర్డినెన్స్ నిర్ణయం చేపట్టారు.

అతిథులకు.. భారం..!





- పని ఒత్తిడితో అతిథి అధ్యాపకులు విలవిల
- పోస్టుల భర్తీపై దృష్టి పెట్టని ప్రభుత్వం
- ఇంజనీరింగ్, సాంకేతిక విద్యాసంస్థల్లో కుంటుపడుతున్న బోధన

బెంగళూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): అతిథి అధ్యాపకులు పని ఒత్తిడితో విలవిలలాడుతున్నారు. విద్యార్థులకు సైతం సరైన బోధన అందక నష్ట పోతున్నారు. దేశంలోనే సాంకేతిక విద్యాకేంద్రంగాను అంతర్జాతీయస్థాయిలో ఐటీ బీటీ రంగాల్లో ప్రముఖకేంద్రంగా రాణిస్తున్న రాష్ట్రంలో ప్రభుత్వ ఇంజనీరింగ్, అనుబంధ సాంకేతిక విద్యాసంస్థల్లోనూ అధ్యాపకుల కొరత వెంటాడుతోంది. బోధన, బోధనేతర సిబ్బంది దశాబ్దాలకాలంగా అదనపుభారంతో సతమతమవుతున్నారు. ముగ్గురు, నలుగురు చేయాల్సిన పనినే ఒకరే నిర్వర్తించాల్సి ఉండడంతో తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నారు. సాధారణంగా ఇంజనీరింగ్‌తో పాటు సాంకేతిక విద్యాసంస్థలు ప్రారంభించేముందే అధ్యాపక, ఉద్యోగులను బదిలీ లేదా నియామకాలు జరుపుతారు. కానీ రాష్ట్రవ్యాప్తంగా నాలుగు ఇంజనీరింగ్ కళాశాలలు, 26 పాలిటెక్నిక్‌లను కొత్తగా ప్రారంభించినా ఒక పోస్టు కూడా భర్తీ చేయకపోవడంతో ఉన్నవారిని సర్దుబాటు ముసుగులో అధ్యాపకులకు, ఉద్యోగులకు మోయలేనిభారం మిగిలింది. రాష్ట్రంలో 16 ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో గదగ్ జిల్లా నరగుంద, చిత్రదుర్గ జిల్లా చళ్ళకెరె, కొప్పళ జిల్లా తలకల్, గంగావతి, హాసన్ జిల్లా మొసళహొసహళ్ళి, బీదర్ ఇంజనీరింగ్ కళాశాలను ప్రారంభించిన వేళ ఉద్యోగులను సృష్టించకుండానే శ్రీకారం చుట్టారు. సదరు కళాశాలలకు అతిథి అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ద్వారా కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొంది. హాసన్ జిల్లా అరసికెరెలో మరో ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణాలు పూర్తి అయ్యాయి. త్వరలోనే ఈ కళాశాల ప్రారంభమయ్యే అవకాశం ఉంది. పోస్టులను మాత్రం సృష్టించలేదు.

మంజూరైనా భర్తీకాని పోస్టులు

సాంకేతిక విద్యారంగానికి సంబంధించి ఇప్పటివరకు 9,944 పోస్టులు మంజూరయ్యాయి. వీటిలో 3,329 పోస్టులు భర్తీ అయ్యాయి. 6,615 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మంజూరైన పోస్టులతో సంబంధం లేకుండా కొత్తగా ప్రారంభించిన కళాశాలలకు 2,947 పోస్టులు అవసరంగా ఆర్థికశాఖకు ప్రస్తావనలు పంపారు. దీన్నిబట్టి 9,562 పోస్టులు సాంకేతిక విద్యాశాఖలో ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం వేలకోట్ల రూపాయలు ఖర్చు చేసి ఇంజనీరింగ్ కళాశాలను, సాంకేతిక విద్యాసంస్థలకోసం సమగ్ర సౌలభ్యాలతో నిర్మాణాలు జరిపింది. వివిధ కోర్సులు ప్రారంభించారు. అయితే ఏళ్ల తరబడి నియామకాలు జరపకపోవడంతో బోధనలు అకడమిక్ సజావుగా సాగడం లేదు. ప్రతి చిన్నపనికి విద్యార్థులు రోజుల తరబడి సంస్థల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఏడేళ్లుగా సాంకేతిక విద్యాసంస్థల్లో ఎటువంటి పోస్టులను సృష్టించకుండానే 26 పాలిటెక్నిక్ సంస్థలను ప్రారంభించారు.

సాంకేతిక విద్యాశాఖ ఉద్యోగులు

మంజూరు	భర్తీ	ఖాళీ
267	118	149

ఇంజనీరింగ్ కళాశాలలు

పోస్టు	మంజూరు	భర్తీ	ఖాళీ	కొత్త పోస్టులు
బోధన	646	339	307	292
బోధనేతర	1150	127	1023	652

పాలిటెక్నిక్ విద్యాసంస్థల్లో...

పోస్టు	మంజూరు	భర్తీ	ఖాళీ	కొత్త పోస్టులు
బోధన	2812	1780	1032	759
బోధనేతర	4642	910	3732	1244

జూనియర్ టెక్నికల్ స్కూల్

పోస్టు	మంజూరు	భర్తీ	ఖాళీ
బోధన	53	20	22
బోధనేతర	174	35	139

ఏఐసీటీఈ నిబంధనలు పాటిస్తాం: మంత్రి

ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) నిబంధనల ప్రకారం ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ సంస్థల్లో బోధన, బోధనేత, పాలనా సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వానికి ఉన్నత విద్యాశాఖ ప్రస్తావనలు పంపింది. మంజూరై ఖాళీగా ఉండే పోస్టులకు వెంటనే నియామకాలు జరపాలనే నిబంధనలు ఉన్నాయి. ఇందుకు సంబంధించి మంత్రివర్గ నిర్ణయం కూడా జరిగింది. నిబంధనలకు అనుగుణంగా ఖాళీ పోస్టులు అన్నింటినీ భర్తీ చేయదలిచామని ఉన్నత విద్యాశాఖ మంత్రి ఎంసీ సుధాకర్ అభిప్రాయపడ్డారు. 2025-26 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐసీటీఈ సూచించిన లోపాలను సరిదిద్దే చర్యలు చేపట్టదలిచారు.



ఆరిన జ్యోతి..!

- భార్య, కుమార్తెను కోల్పోయి ఒంటరి..
- విషాదం మిగిల్చిన మహాకుంభమేళా ప్రమాదం
- వీడియోకాల్‌లోనే చివరి చూపు

బెంగళూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక అయిన ప్రయాగరాజ్ మహాకుంభమేళాలో తలెత్తిన తొక్కిసలాటలో రాష్ట్రంలోని బెళగావికి చెందిన నలుగురు మృతిచెందిన సంగతి తెలిసిందే. ప్రమాదంలో ఎందరో జీవితాల ఆశలు కల్లలుగా మారాయి. ఓ ఉద్యోగి భార్య జ్యోతి, కూతురు మేఘాను కోల్పోయి ఒంటరిగా మిగిలిపోయారు. ఎన్నో కలలుగన్న యువతికి మరో రెండు నెలల్లో పెళ్లి చేయాలని తలపోస్తున్న తరుణంలో విధి వక్రించింది. బెళగావి నగరం వడగావి నివాసి నీటిపారుదల శాఖలో అకౌంట్ సూపరింటెండెంట్ దీపక్, జ్యోతి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తెను హుక్కేరి ప్రాంత యువకుడితో వివాహం జరిపించారు. చిన్న కుమార్తె మేఘా డిగ్రీ పూర్తి చేసి బెళగావిలోని ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తోంది. మరో రెండు నెలల్లో పెళ్లి చేయాలని దీపక్, జ్యోతి నిర్ణయించగా అందుకు మేఘా కూడా సమ్మతించింది. పెళ్లి తర్వాత ప్రయాగరాజ్ వెళ్లేందుకు అవుతుందో.. కాదో? ఈసారి అపురూపమైన మహాకుంభమేళా జరుగుతున్నందున ఎలాగైనా వెళ్లాలంటూ తండ్రిని బలవంతం చేసి తల్లిని పిలుచుకుని వెళ్లింది. మౌని అమావాస్య సందర్భంగా త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేయడానికి కొన్ని గంటల ముందు మేఘా ఫేస్‌బుక్ లైవ్‌లోకి వచ్చి అక్కడి విశేషాలను తెలిపింది. వీడియో చేసిన కొద్దిసేపటికే తొక్కిసలాట సంభవించింది. ఘటనలో మేఘా, ఆమె తల్లి జ్యోతిదీపక్, బెళగావి శెట్టిగల్లికి చెందిన అరుణ్ కోర్పడె, బెళగావి శివాజీనగర్‌కు చెందిన మహదేవి హనుమంత బావనూర మృతి చెందారు. ఘటనలో అరుణ్ కోర్పడె భార్య కాంచన్ గాయపడ్డారు. ఏకకాలంలో భార్య, కుమార్తెను కోల్పోయిన దీపక్ ఒంటరిగా మిగిలాడు. ఆయన రోదన బంధువులను కలచివేస్తోంది. మేఘాకు సంస్కృతి, సంప్రదాయాలపై నమ్మకం ఉందని, ప్రయాగరాజ్‌కు వెళ్లేందుకు మొండికేయగా సంతోషంగా పంపామని అయితే విగతజీవులుగా మారారని మేఘా స్నేహితులు వాపోయారు.



దీపక్

56మంది సురక్షితం

బెళగావి నుంచి ప్రయాగరాజ్‌కు సాయిరథ ట్రావెల్ ఏజెన్సీ ద్వారా రెండు బస్సుల్లో 60మంది ఈనెల 26న వెళ్లారు. వీరిలో తొక్కిసలాటలో నలుగురు మృతి చెందగా మిగిలిన 56మంది సురక్షితంగా ఉన్నట్లు వీడియో సందేశం ద్వారా బంధువులకు సమాచారం ఇచ్చారు. బెళగావికి చెందిన నలుగురు మృతి చెందడంపై స్థానికంగా విషాదం నెలకొంది.



జ్యోతి, మేఘా (ఫైల్)

12 కిలోల గంజాయి స్వాధీనం

హోసూరు(క్రైం), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని బాగలూరు బస్టాండ్‌లో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా డిల్లీ రాష్ట్ర రిజిస్ట్రేషన్ కలిగిన కారు అటుగా వెళ్తుండగా సోదా చేసేందుకు ప్రయత్నించారు. ఇంతలో కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు పారిపోయారు. పోలీసులు వెంబడించినా పట్టుకోలేక పోయారు. అనుమానంతో కారును క్షుణ్ణంగా పరిశీలించగా 12 కిలోల గంజాయిని గుర్తించారు. కారును స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ ప్రాంతం నుంచి కారుల్లో గంజాయిని తీసుకొచ్చిన ఇద్దరు వ్యక్తులు కర్ణాటక రాష్ట్రం, హోసూరు మీదుగా తమిళనాడుకు తీసుకెళ్లేందుకు ప్లాన్ చేసినట్లు ప్రాథమికంగా గుర్తించారు. కేసు నమోదు చేసుకుని నిందితుల కోసం గాలింపు చేపట్టారు.



స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

రూ.31.99 కోట్లతో మురగమల్ల దర్గా అభివృద్ధి

- మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్

చింతామణి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ప్రముఖ యాత్రాస్థలమైన మురగమల్ల గ్రామంలోని హజరత్ ఫకీషావలి దర్గా (అమ్మాజాన్-బావాజాన్) అభివృద్ధి, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూ.31.99 కోట్లు అంచనా వేశామని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ తెలిపారు. గ్రాంట్ల విడుదలకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ప్రతి అమావాస్య, పౌర్ణమి రోజుల్లో దర్గాకు వందలాదిమంది భక్తులు తరలివస్తుంటారని, ఏటా రెండు రోజుల గంధోత్సవం, ఉరుసు ఆచరణలో వేలనుంచి లక్షల్లో ఉంటారన్నారు. ఈ నేపథ్యంలో భక్తులకు వసతి, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం, రాష్ట్ర వక్ఫ్‌మండలి సహకారంతో సమీక్ష నిర్వహించామన్నారు. రూ.62.99 కోట్లతో బ్లూ ప్రింట్‌కు సిద్ధం చేశామన్నారు. తొలిదశలో రూ.31.99 కోట్లు మంజూరుకు మంత్రివర్గం నిర్ణయించిందన్నారు. కేబినెట్ ఆమోదం పలువురు ముస్లిం ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

ఆకతాయులు..!

- పోలసులకు తలనొప్పిగా మారిన 'యులు' బైక్‌లు
- నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారం డ్రైవింగ్
- 30సీసీ కంటే తక్కువ సామర్థ్యం కారణంగా చర్యలు తీసుకోలేమంటున్న రవాణా అధికారులు

బెంగళూరు మెట్రో, జనవరి 30(ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ సమస్య నియంత్రణకు పోలీసులు కసరత్తు చేస్తుండగా ఇది చాలదన్నట్లుగా మోటార్‌సైకిల్ తరహాలో ఉండే యులు బైక్ రైడర్లు చుక్కలు చూపిస్తున్నారు. కేవలం పోలీసులకే కాకుండా ఇతర వాహనదారులకు ఇవి తలనొప్పిగా మారాయి. రోడ్లపై, పార్కుల్లో, ట్రాఫిక్ సిగ్నల్స్ మధ్య, ఫుట్‌పాత్‌లపై సునాయాసంగా వెళ్లగలిగే వీలుండడంతో పాదచారులకు ఇబ్బందిగా పరిణమించాయి. వన్‌వేల్లో వెళ్లడం, ట్రాఫిక్‌సిగ్నల్స్ జంప్ చేయడం, వాహనాల మధ్యలో దూసుకుపోవడం వల్ల ఇతర వాహనదారులకు సమస్యగా మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ట్రాఫిక్ విభాగం జాయింట్ పోలీస్ కమిషనర్ అనుచేత్ అభిప్రాయం మేరకు కర్ణాటక మోటారు వాహనాల నిబంధనల ప్రకారం 30 సీసీ ఇంజన్ సామర్థ్యం కంటే అధికంగా ఉన్న వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సి ఉంటుంది. అయితే యులు బైక్‌లు 30 సీసీ కంటే తక్కువ ఉండడంతో మోటారు వాహనాల నిబంధన పరిధిలోకి రావని, వారిపై జరిమానా విధించడం కూడా సాధ్యం కాదని అంటున్నారు. ఈ బైక్‌లకు ఎటువంటి రిజిస్ట్రేషన్‌లు ఉండవని, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ వంటి నిబంధనలు లేవని కేవలం ఆధార్‌కార్డు నెంబరు ద్వారా యాప్ సాయంతో వీటిని పొందే అవకాశం ఉందన్నారు. వీటిని ఎక్కువగా ఇతర రాష్ట్రాలవారు ఉపయోగిస్తున్నారని, వాహనదారులే కనీస పరిజ్ఞానంతో ఇతరులకు ఇబ్బంది కలగకుండా వాడాలని ఆయన కోరుతున్నారు.



పార్కింగ్‌లో యులు బైక్‌లు (ఫైల్)

ఎన్‌సీసీలో రాణిస్తున్న శ్రీరంజని



ఉపరాష్ట్రపతి జగదీప్‌ధనకర్ దంపతుల నుంచి జ్ఞాపిక అందుకుంటూ..

బెంగళూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజానుకుంటె ప్రెసిడెన్సీ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం కంప్యూటర్ సైన్స్ ఐటీ చదువుతున్న శ్రీరంజని ఎన్‌సీసీలో రాణిస్తోంది. ఆర్‌టీ నగర్ ప్రాంతానికి చెందిన కె సుబ్రమణియన్, స్వర్ణలతల కుమార్తె శ్రీరంజని కల్చరల్ కాంపిటీషన్స్‌లో ప్రత్యేకించి నృత్యాలలో ప్రతిభ చాటుకుంటోంది. సుబ్రమణియన్ బెంగళూరు సిటీ రైల్వేస్టేషన్‌లో రిజర్వేషన్ విభాగం సూపర్‌వైజర్‌గా వ్యవహరిస్తుండగా స్వర్ణలత ప్రైవేట్ పాఠశాల టీచర్‌గా ఉన్నారు. బాల్యం నుంచి చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా ఉన్న శ్రీరంజని పలు పోటీలలో పాల్గొని బహుమతులు సాధించారు. రైల్వే ఇంటర్‌డివిజన్ కాంపిటీషన్‌లో హుబ్బళ్ళి, మైసూరు, బెంగళూరు తదితర విభాగాలలో పాల్గొని ప్రతిభ చాటారు. చదువుతో పాటు ఎన్‌సీసీలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆర్మీ వింగ్ మూడవ కర్ణాటక బెటాలియన్ బెంగళూరు గ్రూప్-ఏ లో కార్పొరల్‌గా ఉన్నారు. ఇటీవలి గణతంత్ర వేడుకల్లో డిల్లీలో పాల్గొని సత్తా చాటారు. ఎన్‌సీసీలో కర్ణాటక, గోవా విభాగం నుంచి బెస్ట్ గ్రూప్ డ్యాన్స్‌గా నిలిచారు. బ్లైండ్ ఫోల్డ్, యక్షగాన, కాంతార, భరత నాట్య విభాగాలలో మొత్తం 20మంది బృందం ఉండగా వారిలో తనదైన గుర్తింపు పొందారు. ఇందుకోసం ఆరు నెలలపాటు రిహార్సల్స్ చేసినట్లు శ్రీరంజని తెలిపారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకర్ నుంచి బెస్ట్ గ్రూప్ డ్యాన్స్ పురస్కారం అందుకున్నారు. ఇదే సందర్భంగా కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నుంచి ప్రశంసలు పొందారు. ప్రతిభను కనబరిచిన శ్రీరంజనిని ఎన్‌సీసీ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ గురుబీర్‌పాల్ సింగ్ అభినందించారు. ఇలా పతిభను చాటిన శ్రీరంజనిని నగరంలో గురువారం విద్యార్థులు, అధ్యాపకులు అభినందించారు.




ట్రోఫీతో శ్రీరంజని



ఎన్‌సీసీ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ గురుబీర్‌పాల్ సింగ్‌తో..

మే 10న కామెడ్-కే ప్రవేశ పరీక్ష

బెంగళూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 150కి పైగా ఇంజనీరింగ్ కళాశాలలతోపాటు దేశవ్యాప్తంగా 50కి పైగా పేరొందిన ప్రైవేట్ ఎయిడెడ్, డీమ్డ్ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశానికి నిర్వహించే కామెడ్-కే పరీక్షల తేదీ ఖరారైంది. కామెడ్-కే, యూజీఈటీ, యుని-గేజ్ 2025 ప్రవేశ పరీక్ష మే 10న శనివారం ఉంటుందని కామెడ్-కే కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కుమార్ తెలిపారు. నగరంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్‌ఎయిడెడ్ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల సంఘం (కేయూపీఈసీఏ), యుని-గేజ్ సభ్యులైన విశ్వవిద్యాలయాలకు అనుబంధమైన కళాశాలల్లో బీఈ, బీటెక్ కోర్సుల్లో ప్రవేశానికి కామెడ్-కె పరీక్ష ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో 200కుపైగా నగరాలలో 400కుపైగా సెంటర్‌లలో పరీక్షలు జరుగుతాయన్నారు. 1.20లక్షలమంది విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. ఆసక్తిగలవారు మార్చి 15లోగా వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చునన్నారు. మీడియా సమావేశంలో సీఆర్ ఫౌండేషన్ సీఈఓ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో డాక్టర్ కుమార్ తదితరులు

రిజిస్ట్రేషన్ల కోసం అవస్థలు

పనిచేయని సర్వర్... రిజిస్ట్రేషన్లు నిల్

రేపటి నుంచి పెరిగిన ధరలతో రిజిస్ట్రేషన్లు



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కోసం వేచిచూస్తున్న క్రయ, విక్రయదారులు

యాడికి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన క్రయ, విక్రయదారులతో గురువారం యాడికి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం కిక్కిరిసింది. ఫిబ్రవరి 1నుంచి పెంచిన మార్కెట్‌వాల్యూ ధరలతో రిజిస్ట్రేషన్లు చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఇదివరకే స్థలాలు, భూముల కొనుగోలుకు అగ్రిమెంట్లు చేసుకున్న వారు రిజిస్ట్రేషన్ కోసం గురువారం యాడికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఎక్కువ సంఖ్యలో వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద వేచిచూడడం కనిపించింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉదయం నుంచి సర్వర్ పనిచేయలేదు. ఈ కారణంగా గురువారం ఒక్క రిజిస్ట్రేషన్ కూడా కాలేదు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్దనే క్రయ, విక్రయదారులు సాయంత్రం వరకు వేచిచూసి వెనుదిరగడం కనిపించింది. ఉదయం 10గంటల నుంచి రిజిస్ట్రేషన్ కోసం వేచిచూశామని, సర్వర్ పనిచేయడం లేదనే అధికారులు చెబుతున్నారని క్రయ, విక్రయదారులు పేర్కొన్నారు. ఫిబ్రవరి 1 నుంచి మార్కెట్ వాల్యూధరలు పెరగనున్నాయని, రిజిస్ట్రేషన్ చార్జీలు కూడా పెరుగుతాయన్నారు. ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్ చేయించుకుందామని వస్తే సర్వర్ పనిచేయని కారణంగా రిజిస్ట్రేషన్లు చేయలేమని అధికారులు చెప్పారని వారు వివరించారు. దీనిపై సబ్‌రిజిస్ట్రార్ జాఫర్‌సాధిక్‌ను వివరణ కోరగా ఉదయం నుంచి సర్వర్‌పనిచేయని మాట వాస్తవమేనని, అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పరిస్థితి ఇలాగే ఉందన్నారు.

ధ్వంసమైన శాసనాల పరిశీలన



శాసనాలను పరిశీలిస్తున్న పురావస్తు శాఖ అధికారులు

కుందుర్పి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ధ్వంసమైన పురావస్తు శాసనాలను గురువారం అధికారులు పరిశీలించారు. కుందుర్పిలోని ఆంజనేయ, వీరభద్ర, నరసింహస్వామి ఆలయాలకు వెళ్లే వెమార్గంలో ఉన్న పురాతన శాసనాలను కొందరు ధ్వంసం చేయగా ఉమ్మడి జిల్లా పురావస్తు శాఖ ప్రదర్శన శాల సహాయ సంచాలకులు డాక్టర్ రజిత ఇంపాక్ట్ సంస్థకు కన్వీనర్ శ్రీనివాసులు, చరిత్రకారుడు నరసింహులు, తహసీల్దార్ శ్రీనివాసులు వాటిని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ శాసనాలను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

ఫిబ్రవరి 6న రంగనాథస్వామి

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఆలయంలో లగ్నపత్రికను రాస్తున్న అర్చకులు

గుత్తి రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథస్వామి దేవాలయంలో స్వామి వారి బ్రహోత్సవాలు ఫిబ్రవరి 6న నుంచి ప్రారంభమవుతాయని ఈఓ రామాంజనేయులు తెలిపారు. గురువారం ఆలయంలో అర్చకులు స్వామి వారి లగ్నపత్రికను రాశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లడుతూ ఫిబ్రవరి 12న స్వామి వారి కళ్యాణం, సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు మురళీశర్మ, రవిస్వామి, రంగనాయకులు, ఆలయ మాజీ చైర్మన్ రంగస్వామిరెడ్డి యాదవ్ పాల్గొన్నారు.

నేడు ప్రైవేట్ విద్యాసంస్థల బంద్

ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు



నిరసన తెలుపుతున్న నాయకులు

అనంతపురం విద్య, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా శుక్రవారం ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు బంద్ నిర్వహిస్తున్నట్లు ఐక్య విద్యార్థి సంఘాల నేతలు తెలిపారు. ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం అంబేడ్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారాయణ కాలేజీలో ఇటీవల విద్యార్థి చరణ్ ఆత్మహత్య చేసుకున్నా కళాశాల యాజమాన్యంపై ఇంతవరకు చర్యలు తీసుకోలేదన్నారు. ఆందోళన చేస్తున్న నాయకులను పోలీసులు అరెస్టు చేయడం సరికాదన్నారు. యాజమాన్యం క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఆర్ఐఓను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో నాయకులు పరమేష్, పృథ్వీ, సురేష్ యాదవ్, చంద్రశేఖర్, చందు, గిరి, హేమంత్, సాయి, అజయ్, కార్తీక్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.13

అనంతపురం రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 13తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు గురువారం 750 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 10, కనిష్ఠ ధర రూ. 7 పలికినట్లు ఆయన తెలిపారు.



దేవదాయ మైదానంలో ఉన్న బస్టాండ్



బళ్లారి రోడ్డులో తాత్కాలిక బస్టాండు



మొలకాల్మూరు రోడ్డులో ఉన్న తాత్కాలిక బస్టాండ్

ఒక ఊరు.. నాలుగు బస్టాండ్లు..!

- నిత్యం ట్రాఫిక్ సమస్య
- నిర్మానుష్యంగా ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్
- రోడ్డు పక్కలోనే తాత్కాలిక బస్టాండ్లు

రాయదుర్గం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఒక ఊరికి ఒకే బస్టాండ్ ఉంటుంది. కానీ రాయదుర్గంలో మాత్రం నాలుగు బస్టాండ్లు ఉన్నాయి. పట్టణంలోని ప్రజలు ఏదైనా ఊరికి వెళ్లాలంటే ఆ మార్గంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న బస్టాండ్ వద్దకు వెళ్లాలి. దీంతో నిత్యం పట్టణంలో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. 80 వేల మందికి పైగా జనాభా ఉన్న రాయదుర్గం పట్టణంలో అటు మొలకాల్మూరు రోడ్డులో బెంగుళూరుతో పాటు కర్ణాటక వైపు వెళ్లే బస్సులు, ఇటు బళ్లారిరోడ్డులో ప్రైవేటు, ఆర్టీసీ బస్సుల కోసం రోడ్డు పక్కనే తాత్కాలిక బస్టాండ్లు ఏర్పాటు చేసుకున్నారు. పట్టణ నడిబొడ్డులో దేవదాయశాఖకు సంబంధించిన ఖాళీ స్థలంలో ప్రైవేటు, ఆర్టీసీ బస్టాండ్‌ను కొన్నేళ్ల నుంచి ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడి నుంచి అనంతపురంతో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు బస్సులు రాకపోకలు సాగిస్తాయి. ప్రధానంగా ఏపీఎస్‌ఆర్టీసీ అధికారికంగా ఏర్పాటు చేసుకున్న బస్టాండ్ మాత్రం నిర్మానుష్యంగా ఉంటుంది. ఇక్కడి నుంచి బస్సుల రాకపోకలు ఏ మాత్రం ఉండవు. బస్టాండ్ నిర్మించి 15 ఏళ్లు అవుతున్నా బస్సులు మాత్రం అక్కడి నుంచి తిప్పడం లేదు. దీంతో పట్టణ ప్రజలకు కేంద్ర బిందువుగా ఉండే బస్టాండ్ ఏమాత్రం లేదు. నాలుగుచోట్ల బస్టాండ్లు ఉండడంతో నిత్యం సమస్యలు తలెత్తుతున్నాయి.

కేంద్రీకృత బస్టాండుతోనే పరిష్కారం

పట్టణ ప్రజలకు అనుకూలంగా ఉండేందుకు నాలుగు బస్టాండ్లను ఒకే చోట కేంద్రీకృతం చేయాల్సిన అవసరం ఉంది. పట్టణం విస్తరిస్తున్న నేపథ్యంలో నాలుగు చోట్ల ఉన్న బస్టాండ్లను ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ వద్దకు కేంద్రీకృతం చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై అధికారులు చొరవచూపి చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం

దేవదాయ శాఖకు చెందిన మైదానంలో ఏర్పాటు చేసిన బస్టాండ్ ప్రధాన రహదారికి ఆనుకుని ఉంది. పట్టణ నడిబొడ్డులో ఉండడంతో వాహన రాకపోకలు అధికంగా ఉంటాయి. దీనికి తోడు కూరగాయల మార్కెట్, ప్రభుత్వ వైద్యశాల, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, బాలికల కళాశాల, బాలికల ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. దీంతో జనసంచారం విపరీతంగా ఉంటుంది. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల దాకా విపరీతమైన రద్దీ ఉంటుంది. బస్సులు, విద్యార్థులు, ద్విచక్ర వాహనాలు, భారీ వాహనాలు ఒకే సమయంలో రాకపోకలు చేస్తుండడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందికరంగా మారుతోంది. ఈ నేపథ్యంలో నాలుగు గంటల వ్యవధిలో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయి శబ్ద, వాయుకాలుష్యం విపరీతంగా వెదజల్లుతోంది. ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ఎంత ప్రయత్నించినా ఫలితం ఉండడం లేదు. నాలుగు



బస్టాండ్ల సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రోడ్డు పక్కనే బస్టాండ్లు

మొలకాల్మూరు వెళ్లే రహదారిలో రోడ్డు పక్కన ఒక బస్టాండ్ ఉండగా.. బళ్లారి వైపు వెళ్లే దారిలో ఇంకో బస్టాండ్ ఉంది. ఈ బస్టాండ్లకు మధ్యలో వినాయక సర్కిల్ ఉంది. రెండు వాహనాలు తిరిగే మార్గం కావడంతో ఒక వైపు ఒక్కసారిగా ఆర్టీసీ, ప్రైవేటు బస్సులతో పాటు కర్ణాటక బస్సులు కూడా రోడ్డులో నిలబడుతున్నాయి. వీటి నుంచి ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోతుంది. బస్సుల కోసం రోడ్ల మీదే తాత్కాలిక బస్టాండ్లు ఉండడంతో ఆ బస్సులన్నీ వినాయక సర్కిల్ వద్ద తిప్పుకుంటాయి. ఒక దాని వెనుక ఒకటి వెళ్లి తిప్పుకుంటుంటే ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే వాహనాలు ఢీ కొనడంతో సర్కిల్ మధ్యలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహం ధ్వంసమయింది. చిన్నపాటి ప్రమాదాలు చాలా జరిగాయి. ఆటోల రాకపోకల వల్ల కూడా తాత్కాలిక బస్టాండ్ల వద్ద తీవ్ర అసౌకర్యంగా మారింది.

ప్రపంచ దృష్టిని జిల్లా వైపు తిప్పుతాం

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లావైపు ప్రపంచ దృష్టిని తిప్పితామని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. హార్టికల్చర్ హబ్‌గా జిల్లాను మారుస్తామన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో ఏపీఎంఐపీ (సూక్ష్మ సాగు నీటి పథకం) కింద 290 మంది రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లను పయ్యావుల కేశవ్, కలెక్టర్ వినోద్ కుమార్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో లక్ష ఎకరాల్లో సూక్ష్మ సాగునీటి పథకం లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఉమ్మడి జిల్లాలో 34వేల హెక్టార్లకు మాత్రమే డ్రిప్, స్ప్రింక్లర్లను ఇచ్చారన్నారు. ఆర్థిక విధ్వంసం జరిగిన రాష్ట్రంలో సంక్షేమపథకాలను అమలు చేయడం మాత్రం పక్కా అని పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరం తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామన్నారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని వివరించారు. కేంద్ర ప్రభుత్వం సహాయంతో పోలవరం, అమరావతి, రైల్వే ప్రాజెక్టులు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా రైతుల తలరాతలు మారాలంటే హంద్రీనీవాతోనే సాధ్యమన్నారు. పోలవరం నుంచి బనకచర్ల రెగ్యులేటర్‌కు నీళ్లను అనుసంధానం చేయాలని ప్రణాళిక రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 80వేల హెక్టార్లకు డ్రిప్ పరికరాలను మంజూరు చేస్తే, వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 40వేల హెక్టార్లకు మాత్రమే ఇచ్చారన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమానికి, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. దావోస్ పర్యటన ద్వారా సీఎం రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు తీసుకువచ్చేందుకు కృషి చేశారన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 37,500హెక్టార్లకు డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరు లక్ష్యంగా ఉందన్నారు. ఇప్పటికే 10,313హెక్టార్లకు మంజూరు చేశామన్నారు. సూక్ష్మ సాగు నీటి పథకంలో దేశంలో జిల్లాను మూడవ స్థానంలో నిలిచేలా లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం జరిగిందన్నారు. వచ్చేనెల 5న హార్టికల్చర్ కాంక్లేవ్ నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లాకు సంబంధించిన ఒప్పందాలు కుదుర్చుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీరఘునాథరెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్, ఏడీ ఫిరోజ్‌ఖాన్, తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఎంపీడీవో రవిప్రసాద్, టీడీపీ నాయకులు దేవినేని పురుషోత్తం, రేగాటి నాగరాజు, విజయ్‌భాస్కర్, నూతేటి వెంకటేశులు, రామాంజినేయులు, మారెన్న, తిమ్మప్ప, ప్యారం కేశవానంద, మాజీ ఎంపీపీ సుంకరత్నమ్మ పాల్గొన్నారు.



డ్రిప్, స్ప్రింక్లర్లను పంపిణీ చేస్తున్న పయ్యావుల కేశవ్, చిత్రంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కలెక్టర్ వినోద్‌కుమార్

హరిహరుల క్షేత్రం... అశ్వత్థం

- ఆదివారం నుంచి తిరుణాల
- ప్రతి ఏటా మఘమాసంలో ప్రారంభం
- తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తుల రాక
- తాడిపత్రి, అనంతపురం నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు



అశ్వత్థనారాయణస్వామి, శింగరభట్టు మహర్షి మూలవిరాట్



శ్రీచక్ర భీమలింగేశ్వరస్వామి

పెద్దపప్పూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపప్పూరు సమీపంలో వెలసిన అశ్వత్థ నారాయణస్వామి, శ్రీ చక్ర స్థాపిత భీమలింగేశ్వరస్వామివారి తిరుణాల ఫిబ్రవరి 2 నుంచి ప్రారంభం కానుంది. ప్రతి ఏటా మాఘమాసంలో స్వామివారి తిరుణాలను వైభవంగా నిర్వహిస్తారు. స్వామివారిని దర్శించుకోవడానికి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు నుంచి కూడా భక్తులు పెద్దఎత్తున తరలివస్తారు. తాడిపత్రి నుంచి 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ప్రముఖ పుణ్యక్షేత్రం పెన్నా నది ఒడ్డున ఉంది.

స్థల పురాణం

పూర్వం కంచి నుంచి శింగరభట్టు అనే మునీశ్వరుడు శంఖం, చక్రం, గద, అభయహస్తంతో కూడిన శ్రీ విష్ణుమూర్తి దర్శనార్థం ఇక్కడకు వచ్చాడని స్థలపురాణం చెబుతోంది. ఆ మహారుషి వరదరాజులస్వామిని ప్రసన్నం చేసుకొనేందుకు 12సంవత్సరాలు స్వామివారికి సేవ చేశారు. ఇదే సమయంలో రావణ సంహారం అనంతరం శ్రీరామచంద్రుడు ఈ క్షేత్రానికి సమీపంలో ఉన్న పెద్దపప్పూరు రామకోటిలో నివసించేవాడని స్థలపురాణం చెబుతోంది. రావణుడు బ్రాహ్మణుడు కావడంతో బ్రాహ్మణ హత్యా పాతకమును భరించలేని శ్రీరాముడు అశ్వత్థ క్షేత్రంలో ఉన్న శింగరభట్టును కలిసి జరిగిన విషయాన్ని తెలిపారు. దీనికిగాను శింగరభట్టు మహర్షి నీ పాపమును నేను స్వీకరిస్తాను అని చెప్పాడు. తదనంతరం లక్ష్మీ సమేత విష్ణుమూర్తి ప్రసన్నం కోసం తపస్సు చేశాడు. మహారుషి శింగరభట్టుకు స్వప్నంలో స్వామివారు సాక్షాత్కరించారు. ఈ సందర్భంగా స్వామివారు ఇక్కడ స్నానం ఆచరించిన భక్తులకు బ్రాహ్మణహత్యాపాతకము ఉండదని, రావి, వేపచెట్టు చుట్టూ తిరిగి ప్రత్యేక పూజలు చేసిన వారికి కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పాడు. అనంతరం నదిలో విగ్రహ రూపంలో దర్శనమిస్తానని స్వామివారు శింగరభట్టుకు తెలియజేశారు. నీవు కూడా విగ్రహ రూపంలో నా పక్కనే కొలువు ఉంటావని, నీ తర్వాతే భక్తులు నన్ను దర్శించుకుంటారని చెప్పి అంతర్ధానమయ్యారని పురాణం చెబుతోంది.

వేములవాడ భీమకవి ప్రతిష్ఠించిన భీమలింగేశ్వరుడు

శ్రీ అశ్వత్థనారాయణస్వామి క్షేత్రంలోనే స్వామివారికి అభిముఖంగా శ్రీ చక్రస్థాపిత భీమలింగేశ్వరున్ని వేములవాడ భీమకవి ప్రతిష్ఠించాడు. ముందుగా స్వామివారి లింగం కిందిభాగాన శ్రీ చక్రాన్ని జగద్గురు ఆదిశంకరాచార్యులు ప్రతిష్ఠించారని ప్రతీతి. ఎక్కడాలేనివిధంగా శివుని దర్శనం కోసం వచ్చిన భక్తులకు విష్ణుమూర్తి దర్శనం కావడం, విష్ణుమూర్తి దర్శనం కోసం వచ్చిన భక్తులకు శివయ్య దర్శనం కావడం ఇక్కడ ఆలయ విశేషం. దీంతో ఆలయాన్ని హరిహరుల వెలసిన క్షేత్రంగా ప్రసిద్ధికెక్కింది.

ప్రతి ఏటా మాఘమాసంలో తిరుణాల

ప్రతి ఏటా ఫిబ్రవరిలో వచ్చే మాఘమాసంలో అశ్వత్థం తిరుణాల వైభవంగా జరుగుతుంది. ఈ సందర్భంగా అశ్వత్థ నారాయణస్వామి సన్నిధిలోని అశ్వత్థ కట్ట వద్ద వెలసిన నారాయణుడికి, శింగరభట్టు మహర్షికి, వినాయకుడికి ప్రత్యేక పూజలు జరుగుతాయి. అనంతరం అభిముఖంగా వెలసిన భీమలింగేశ్వరున్ని భక్తులు దర్శించి మొక్కులు తీర్చుకుంటారు. ఈ ఏడాది నాలుగువారాలపాటు తిరుణాల జరగనుంది. మూడో వారంలో భక్తులు వేలాదిగా తరలివస్తారు.

ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు..

ఎంతో ప్రసిద్ధిగాంచిన అశ్వత్థ క్షేత్రానికి రెండు తెలుగురాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తారు. స్వామివారు కోరిన కోర్కెలు తీరుస్తారని ఇక్కడి నదిలో పుణ్యస్నాం చేసి స్వామివారిని దర్శించుకుంటే సకల పాపాలు హరిస్తాయని భక్తుల నమ్మకం. వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్ని సౌకర్యాలు ఏర్పాటుచేశారు. ఆలయానికి చేరుకోవడానికి తాడిపత్రి, అనంతపురం నుంచి ఆర్టీసీ డిపో అధికారులు ప్రత్యేక సర్వీసులు నడపనున్నారు. మహిళా భక్తులకు స్నానమాచరించేందుకు ప్రత్యేక గదులు ఏర్పాటుచేశారు. ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పోలీసులు పెద్దఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు.

చీనీకి పొలుసు పురుగు ముప్పు

ఉద్యాన శాఖాధికారి అమరేశ్వరి

తాడిమర్రి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో చీనీ చోట్లకు పొలుసు పురుగు అధికంగా వ్యాప్తి చెందుతోందనీ, రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానవన అధికారి (హెచ్ఓ) అమరేశ్వరి సూచించారు. మండలంలోని శివంపల్లిలో గురువారం చీనీ రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యాన శాఖాధికారి మాట్లాడుతూ.. పొలుసు పురుగు ఉధృతి కారణంగా చీనీ చెట్లు చనిపోతున్నాయన్నారు. రైతులు అప్రమత్తంగా ఉంటూ పురుగు వ్యాప్తిని ప్రాథమిక దశలోనే గుర్తించాలన్నారు. 5 ఎం.ఎల్. షాంపూని లీటరు నీటికి కలిపి చెట్టు బాగా తడిసేలా పిచికారీ చేయాలన్నారు. ఆ తరువాత రోజు వేపనూనె, సిప్రోనిల్ 2 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఐదో రోజు స్పైరో టెట్రమాట్ 0.8 ఎం.ఎల్. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. పొలుసు పురుగు వ్యాప్తి చెందకుండా చీనీ చెట్టు కాండానికి మైలుతుత్తి, సున్నం కలిపి పూత పూయాలన్నారు. వేసవిలో చీనీ చెట్లు చనిపోకుండా, వేరుకుళ్లు సోకకుండా వందలీటర్ల నీటికి కిలో యూరియా కలిపి పిచికారీ చేయాలని ఆమె వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రమాదేవి, రైతు సేవా కేంద్రం అధికారులు గౌతమి, అజయ్, నిజాముద్దీన్, రైతులు పాల్గొన్నారు.

రేపు జిల్లాకు శాప్ చైర్మన్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు ఫిబ్రవరి 1న జిల్లాకు రానున్నట్లు డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. ఫిబ్రవరి 2న ఉదయం క్రీడాశాఖ ఆధ్వర్యంలో చేపట్టే వీ-రన్‌లో ఆయన పాల్గొంటారు. అదే రోజు మధ్యాహ్నం ఆర్డీటీ స్టేడియంను సందర్శించి, 3న ఉదయం అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియాన్ని పరిశీలిస్తారు. అనంతరం క్రీడాశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం తిరుపతికి వెళ్తారని డీఎస్‌డీఓ పేర్కొన్నారు.


ఎమ్మెస్సీ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎమ్మెస్సీ పరీక్షా ఫలితాలను గురువారం విడుదల చేసినట్లు డైరెక్టర్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నాగప్రసాద్‌నాయుడు తెలిపారు. నవంబరు, డిసెంబరులో తృతీయ సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. అదేవిధంగా నాల్గవ సెమిస్టర్(ఆర్21) విద్యార్థులకు రెగ్యులర్ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. విద్యార్థులు వారి ఫలితాలకోసం www.jntuaresults.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

మంత్రి కొల్లు పర్యటన వాయిదా

అనంతపురం అర్బన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర జిల్లా పర్యటన వాయిదా పడింది. శుక్రవారం అనంతపురం నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో నూతన మద్యం పాలసీలో భాగంగా నవోదయం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరుకావాల్సి ఉంది. అనంతరం సోములదొడ్డి సమీపంలో ఐఎంఎల్ డిపోను ప్రారంభించాలని నిర్ణయించారు. అయితే శుక్రవారం సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సమావేశం ఉండటంతో జిల్లా పర్యటనను రద్దు చేసుకున్నారు. తదుపరి పర్యటన తేదీని త్వరలోనే ప్రకటించే అవకాశం ఉన్నట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

ఆంధ్ర-14 జట్టులో ముగ్గురికి చోటు



ఎంపికైన రోహిత్, లిఖిత్, ఆదినారాయణరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర-14 రాష్ట్ర బాలుర జట్టులో జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులకు చోటు దక్కింది. జిల్లాకు చెందిన రోహిత్, లిఖిత్, ఆదినారాయణరెడ్డి జట్టుకు ఎంపికయ్యారు.

గాంధీజీ పోరాట స్ఫూర్తితోనే దేశానికి స్వాతంత్య్రం

● సీఎం సిద్దరామయ్య



విధానసౌధలో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద సీఎం, మంత్రులు



ఛాయాచిత్ర ప్రదర్శనను వీక్షిస్తున్న మంత్రి హెచ్‌కె పాటిల్

బెంగళూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): దేశంలో సుదీర్ఘకాలం స్వాతంత్య్ర పోరాటానికి గాంధీజీయే నాయకత్వం వహించారని, ఆయన పోరాట స్ఫూర్తియే దేశానికి స్వాతంత్య్రం లభించేందుకు సాధ్యమయ్యిందని సీఎం సిద్దరామయ అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా గురువారం ఘన నివాళులు అర్పించారు. విధానసౌధ ప్రాంగణంలోని జాతిపిత విగ్రహానికి, చిత్రపటానికి సీఎం సిద్దరామయ్య పుష్పాంజలి ఘటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. సభాపతి బసవరాజ హొరట్టి, మంత్రులు దినేశ్ గుండూరావు, జమీర్ అహ్మద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీఎం మాట్లాడుతూ గాంధీజీని నాథూరామ్ గాడ్సే తుపాకీతో కాల్చడంతో దేహాన్ని వీడారన్నారు. అయితే గాంధీజీ ఆశయాలు మాత్రం నేటికీ సజీవంగా ఉన్నాయన్నారు. 'నా జీవితమే నా సందేశం' అని మహాత్ముడు చాటి చెప్పారని, ఆయన చూపిన మార్గం అనుసరణీయమన్నారు. సత్యం, అహింస, సత్యాగ్రహాలతో ప్రజలను చైతన్యం చేసిన గాంధీజీ సిద్ధాంతాలు, ఆదర్శాలు భావితరాలకు కూడా అందేలా కృషి చేస్తామన్నారు. 1924 డిసెంబరు 25, 26, 27 తేదీలలో బెళగావిలో కాంగ్రెస్ సమావేశాలకు మహాత్మాగాంధీ అధ్యక్షత వహించారని గుర్తు చేశారు. దేశంలో సుదీర్ఘకాలం స్వాతంత్య్ర పోరాటానికి గాంధీజీయే నాయకత్వం వహించారన్నారు. ఆయన పోరాట స్ఫూర్తియే దేశానికి స్వాతంత్య్రం లభించేందుకు సాధ్యమైందన్నారు. ఇలా బ్రిటీష్ దాస్యం నుంచి విముక్తి సాధ్యమైందన్నారు. కాగా గ్రామాల అభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యమని ప్రతిపాదించారని ఆ దిశగా గ్రామస్వరాజ్య పరికల్పన అమలవుతోందన్నారు. గాంధీజీ కలలుగన్న భారతదేశం కోసం తమవంతు ప్రామాణికంగా ప్రయత్నం చేస్తామన్నారు.

బృహత్ బెంగళూరు మహానగర పాలికె, గాంధీభవన్ సహా పలు ప్రాంతాలలో మహాత్ముడి విగ్రహాలు, చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. గాంధీభవన్‌లో ఏర్పాటైన ఛాయాచిత్ర ప్రదర్శనలో మంత్రి హెచ్‌కె పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముడి ఆశయాలు భావితరాలకు అందిస్తాం

● గాంధీజీ ఆశయాలకు వ్యతిరేకంగా బీజేపీ తీరు ● కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం: డీసీఎం డీకే శివకుమార్

బెంగళూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): గాంధీజీ ఆదర్శాలు, ఆశయాలు భావితరాలకు అందేలా రాష్ట్రవ్యాప్తంగా జై బాపు, జై భీమ్, జై రాజ్యాంగం నినాదంతో సమావేశాలు నిర్వహించనున్నట్లు ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. నగరంలోని కేపీసీసీ కార్యాలయంలో గురువారం మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మహాత్ముడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జాతిపిత మహాత్మాగాంధీజీ ఆశయాలను ప్రపంచమంతా అంగీకరించిందన్నారు. మార్పుకోసం తొలుత మనమే కృషి చేయాలని మహాత్ముడు ప్రతిపాదించారన్నారు. నిన్ను నీవు నియంత్రించుకోవాలంటే మెదడును ఉపయోగించాలని, వేరేవారిని నియంత్రించాలంటే హృదయాన్ని ఉపయోగించాలని గాంధీజీ చాటి చెప్పారన్నారు. మహాత్ముడి ఆదర్శాలను భావితరాలకు అందేలా రాష్ట్రవ్యాప్తంగా సమావేశాలు నిర్వహిస్తామన్నారు. కాగా బీజేపీ నాయకులు గాంధీజీ ఆశయాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆయన విగ్రహం వద్ద నిరసనలు, ధర్నాలు చేస్తారని అయితే మహాత్ముడి బాటలో మాత్రం కొనసాగడం లేదన్నారు. గాంధీజీ మౌనం, ధ్యానం వెనుక గొప్ప సందేశం ఉందన్నారు. స్వదేశీ ఆలోచన గాంధీజీదే అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ దీన్నే 'మేక్ ఇన్ ఇండియా' అంటూ ప్రకటించుకుంటున్నారన్నారు.

స్వాతంత్య్ర సంగ్రామంలో బీజేపీ నాయకుల పాత్ర ఏమీ లేదన్నారు. మహాత్మాగాంధీ కాంగ్రెస్ అధ్యక్షుడిగాను వ్యవహరించడమే కాక స్వాతంత్య్ర పోరాటానికి నాయకుడిగా ప్రజలకు దిశా నిర్దేశం చేశారన్నారు. గాంధీజీ ఆశయాలను ప్రచారం చేసేందుకు ఏడాది పొడవునా జై బాపు, జై భీమ్, జై రాజ్యాంగం కార్యక్రమాన్ని నిర్వహించే ఆలోచన ప్రభుత్వానికి ఉందన్నారు. గాంధీ భారత కార్యక్రమ ఆచరణ సమితి ఇచ్చిన నివేదిక ప్రకారం ముఖ్యమంత్రి సిద్దరామయ్య తన బడ్జెట్ సందేశంలో తెలియజేసే అవకాశం ఉందన్నారు. ఈ విషయమై ఏఐసీసీ అధ్యక్షుడికి విన్నవించామన్నారు.

2న ఓటర్లకు అభినందన సమావేశం

చన్నపట్టణ ఉప ఎన్నికల్లో విజయం సాధించిన నేపథ్యంలో ఓటర్లకు అభినందన తెలిపే సమావేశం ఫిబ్రవరి 2న నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం కోసం నాయకులు, కార్యకర్తలు ఎంతగానో శ్రమించారన్నారు. బెళగావి సమావేశాల కారణంగా ఈ కార్యక్రమం చేపట్టేందుకు జాప్యమైందన్నారు.

నీటి చార్జీల పెంపు అనివార్యం

బెంగళూరులో తాగునీటి చార్జీల పెంపు అంశంపై మీడియా ప్రశ్నించగా గత 11ఏళ్లలో నీటి చార్జీలు పెంచలేదన్నారు. జలమండలికి ఏటా సుమారు వెయ్యికోట్ల మేర నష్టం వాటిల్లుతోందని దీన్ని అధిగమించేందుకు ఎటువంటి ప్రత్యామ్నాయం లేదన్నారు. జలమండలి మనుగడకోసం బీజేపీ ఎమ్మెల్యేలు కూడా పలు సలహా సూచనలు చేశారన్నారు. నీటి కనెక్షన్‌ల వ్యవస్థను విస్తరించేందుకు సుమారు 6వేల కోట్లు ఖర్చు కానుందన్నారు. ఈ నేపథ్యంలో నీటి చార్జీల పెంపు అనివార్యమని స్పష్టం చేశారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరిస్తాం

● ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి హామీ



ఎమ్మెల్యేతో ఉపాధ్యాయుల బృందం

బంగారపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలపై స్పందించి పరిష్కారానికి శక్తివంచన లేకుండా పాటుపడతానని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి తెలిపారు. పట్టణంలోని గృహ కార్యాలయంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం పదాధికారులు ఎమ్మెల్యేను భేటీ అయ్యారు. ఎన్‌పీఎస్ పద్ధతిని రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్)ను అమలు చేయాలని కోరుతూ ఉపాధ్యాయులు విన్నవించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ముఖ్యమంత్రితో చర్చిస్తానని హామీ ఇచ్చారు. జిల్లా ఉపాధ్యాయులసంఘం అధ్యక్షుడు సీ అప్పయ్యగౌడ మాట్లాడుతూ 12ఏళ్లుగా టీచర్ల సమస్యలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, ఉపాధ్యాయుల సంఘం కార్యాలయానికి 10 గుంటల భూమిని మంజూరు చేశారన్నారు. నిర్మాణ పనులు ప్రగతిదశలో ఉన్నాయన్నారు. సంఘానికి సొంత భూమి నిర్మించేందుకు అవకాశం కల్పించిన సంఘం తరపున ధన్యవాదాలన్నారు. బృందంలో సంఘం ఉపాధ్యక్షుడు కాంతరాజ్, తాలూకా కసాప అధ్యక్షుడు ఆర్ అశ్వత్, ఉపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామమూర్తి, ఉపాధ్యాయులు గజేంద్ర, రాజలక్ష్మి, కవితా రాణి పాల్గొన్నారు.

యోగాతో మెరుగైన ఆరోగ్యం

● వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ జయకర ఎస్ఎం



వివేకానందుడి చిత్రపటం నివాళి అర్పిస్తున్న వీసీ

బెంగళూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): క్రమం తప్పని యోగా పాటించడం ద్వారా మెరుగైన ఆరోగ్యం సాధ్యమని బెంగళూరు విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ జయకర ఎస్ఎం అభిప్రాయపడ్డారు. యోగాకేంద్రం ఆధ్వర్యంలో గురువారం స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. జిగణిలోని స్వామి వివేకానంద యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ డాక్టర్ ఎంకే శ్రీధర్, బెంగళూరు వర్సిటీ విద్యార్థి క్షేమాభివృద్ధి విభాగం డైరెక్టర్ డాక్టర్ పీసీ నాగేశ్ పాల్గొన్నారు.



యోగా విన్యాసం

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



బంద్రి గ్రామంలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అన్నపూర్ణ

తోరణగల్లు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): సండూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారాం భూమిపూజ చేశారు. కొండాపూర్ గ్రామంలో మహర్షి వాల్మీకి భవన నిర్మాణ పనులను, తాలుకాలోని తిమ్మాపురం ఎన్‌హెచ్ 50 నుంచి చోర్నూరు నిడగుర్తి, 72 మల్లాపురం, ఎన్‌హెచ్ 28 వరకు 5.39 కి.మీ నుంచి 13.84 కి.మీ రస్తా అభివృద్ధికి భూమిపూజ చేశారు. కాటినకంబ గ్రామంలో వాల్మీకి భవన పనులకు, హలే జోగినహళ్లి గ్రామ గ్రంథాలయం, సూవినహళ్లి గ్రామంలో సీసీ రస్తా, మురుగు కాలువకు భూమిపూజ నిర్వహించారు.

పొగాకు వాడకాన్ని నియంత్రించాలి

బళ్లారి సిటీ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పొగాకు వినియోగాన్ని నియంత్రించేందుకు పాఠశాలలు, కళాశాలలతోపాటు గ్రామ పంచాయితీ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అసిస్టెంట్ కలెక్టర్ మహ్మద్ జుబేర్ సూచించారు. నగరంలోని అనంతపురం రోడ్డులో ఉన్న నూతన జిల్లాపాలనా భవనంలోని హాల్లో ఏర్పాటు చేసిన పొగాకు నియంత్రణ సెల్ ప్రగతి సమీక్ష సమావేశానికి అధ్యక్షత వహించి ఆయన మాట్లాడారు. ప్రస్తుతం యువత కూడా పొగాకు ఉత్పత్తులకు ఆకర్షితులై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. పాఠశాలలు, పీజీ కళాశాలల్లో కోట్పా-2023లోని సెక్షన్లను తప్పకుండా పాటించాలని అధికారులకు సూచించారు. పారిశ్రామిక రంగాల్లోనూ పొగాకుపై అవగాహన కల్పించాలని జిల్లా పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలను నిషేధించాలన్నారు. నాటికల ద్వారా పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా సర్జన్ డాక్టర్ బసారెడ్డి, క్షయవ్యాధి నిర్మూలన అధికారిణి డాక్టర్ ఇంద్రాణి, విద్యాశాఖాధికారి ఈశ్వర దాసప్పనవర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సుఖసంతోషాలతో జీవితాన్ని గడపాలి

● అంకలి మఠం గురువు వీరభద్ర స్వామి

సిరుగుప్ప, జనవరి 30(ఆంధ్రజ్యోతి): వధూవరులు సుఖ సంతోషాలతో జీవితాన్ని గడపాలని అంకలి మఠం గురువు వీరభద్ర మహాస్వాములు అన్నారు. బుధవారం సిరుగుప్ప పట్టణం సింధనూరు రోడ్డులో వెలసిన అంకలి మఠంలో ఎనిమిది జంటలకు ఉచిత సామూహిక వివాహాలు నిర్వహించారు. వీరభద్ర స్వామి జంటలకు మాంగల్యధారణ జరిపించారు. జంటలను ఆశీర్వదించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బీఎం సతీష్ మాట్లాడుతూ ముందు రోజుల్లో నిరుపేదలు వివాహాలు చేసుకోవడానికి అంకలి మఠంలో సముదాయ భవనం నిర్మాణం పనులు చేపట్టామని తెలిపారు. ఏళ్లుగా మఠంవారు సామూహిక వివాహాలు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం స్వాముల వారికి తులాభారం చేశారు. ప్రముఖ నేతలను, గురువులకు స్వాముల వారు సన్మానించారు. బసవ భూషణ స్వాములు, కాంగ్రెస్ పార్టీ తాలుకా అధ్యక్షుడు కరి బసప్ప, నాయకులు కొడ్లి మల్లికార్జున, కౌన్సిలర్ నజీర్ అహ్మద్, మఠం ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస, హంస్సేనప్ప, మల్లికార్జున, లోకేష్ పాల్గొన్నారు.




సామూహిక వివాహాలు నిర్వహిస్తున్న దృశ్యం

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామత్...

డాక్టర్ ద రా బేంద్రె (జయంతి)



కన్నడ కవి, 'పద్మశ్రీ' పురస్కార గ్రహీత దత్తాత్రేయ రామచంద్ర బేంద్రె (ద రా బేంద్రె) 1896 జనవరి 31న ధార్వాడలో జన్మించారు. కవిగా 'అంబికాతనయ దత్త' కలం పేరిట రచనలు చేశారు. వృత్తి రీత్యా ఉపాధ్యాయుడైనా సాహిత్యంపై మక్కువతో ఎన్నో రచనలు చేసి 'వరకవి'గా పేరొందారు. నాటకాలు, పరిశోధనాత్మక రచనలు, కావ్య విమర్శలు రచించారు. శివమొగ్గలో కన్నడ సాహిత్య సమ్మేళనానికి అధ్యక్షత వహించారు. 'నాకుతంతి' పుస్తకానికి 'జ్ఞానపీఠ' పురస్కారం దక్కింది. ఉడుపి అదమారు మఠం నుంచి 'కర్ణాటక కవి తిలక' బిరుదు పొందారు. కేంద్ర సాహిత్య అకాడమీ తదితర పురస్కారాలు పొందారు. ఆయన జీవితంపై ప్రముఖ దర్శకుడు గిరీశ్ కర్నాడ్ ఒక డాక్యుమెంటరీ సినిమా తీశారు. బేంద్రె 1981 అక్టోబరు 26న కన్నుమూశారు.

కందుకూరి రామభద్రరావు (జయంతి)



జాతీయవాదిగా పేరొందిన కందుకూరి రామభద్రరావు 1905 జనవరి 31 తూర్పుగోదావరి జిల్లా ఆత్రేయపురం మండలం రాజవరం గ్రామంలో జన్మించారు. తెలుగు, సంస్కృత, ఆంగ్ల భాషలలో నిష్ణాతులు. మహాత్మాగాంధీ అనుయాయి. ఉత్తమ ఉపాధ్యాయుడిగా, విద్యావేత్తగా, ఉపన్యాస చతురుడిగా మన్ననలు అందుకున్నారు. ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో విద్యా కార్యక్రమాల ప్రయోక్తగా, లలిత గీతాలు, దేశభక్తి గీతాలు, సంగీత రూపకాలను రచించి, ప్రసారమై జనరంజకం కావడంలో కీలకంగా వ్యవహరించారు. పద్య, గేయరచనా పద్ధతుల్లో వీరు సవ్యసాచి. 1976 అక్టోబరు 8న అస్తమయం చెందారు.

దయా మాత (జయంతి)



దయా మాత 1914 జనవరి 31న అమెరికాలో జన్మించారు. ఆమె అసలు పేరు రాచెల్ ఫయె రైట్. పరమహంస యోగానంద శిష్యురాలు. యోగోద సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా(వైఎస్ఎస్)కి ఐదు దశాబ్దాలకుపైగా అధ్యక్షురాలిగా వ్యవహరించారు. ఆధ్యాత్మిక సంస్థ సెల్ఫ్ రియలైజేషన్ ఫెలోషిప్ (ఎస్ఆర్ఎఫ్) ద్వారా బోధనలు విస్తృతం చేశారు. ఆధ్యాత్మిక వేత్త, మానవతావాదిగా పేరొందారు. గురు బోధనలు ప్రచారం చేయడమే లక్ష్యంగా సాగారు. 2010 నవంబరు 30న పరమపదించారు.

ఎంఆర్ అప్పారావు (వర్ధంతి)



మేకా రంగయ్య అప్పారావు 1915 మార్చి 21న కృష్ణా జిల్లా నూజివీడులో జన్మించారు. జమీందారు కుటుంబానికి చెందిన ఆయన విద్యావేత్త, మాజీ మంత్రి కూడా. కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా ఉంటూ మద్రాస్ అసెంబ్లీకి, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి నూజివీడు నుంచి పలుమార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1974-80ల మధ్య సాంస్కృతిక మంత్రిగా వ్యవహరించారు. ఆంధ్రా యూనివర్శిటీకి ఉపకులపతిగా పని చేశారు. 1981-82లమధ్య రాజ్యసభ సభ్యుడిగా వ్యవహరించారు. పలు రచనలు చేయడమే కాక సాహిత్య, సాంస్కృతిక సంస్థలకు సాయం అందించారు. 2003 జనవరి 31న కన్నుమూశారు.

ట్రాఫిక్‌పై జాగృతి

బాగేపల్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ, పోలీసుశాఖ సంయుక్తంగా ఏర్పాటు ట్రాఫిక్‌పై జాగృతిలో విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు రంగనాథ్ మాట్లాడుతూ మనం చేసే పొరపాట్లు, తప్పుల కారణంగానే తరచూ ప్రమాదాలు జరుగుతాయన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించడం, కార్లు ఇతర వాహనాల వారు సీటుబెల్టు ధరించడం తప్పనిసరి అనే నిబంధన పాటించడం లేదన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటించి ఇతరులకు ఇబ్బంది కలగకుండా వ్యవహరించాలన్నారు. మొబైల్ వాడకంలోనూ జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల, హైస్కూల్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పప్పుశనగ పంట దగ్ధం

గంగావతి రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కొప్పళ జిల్లా యలబుర్గా తాలూకా చిక్కమ్యాగేరి గ్రామంలోని రైతు తిప్పణ్ణ మురారికి చెందిన పప్పుశనగ పంట అగ్నికి ఆహుతైంది. పొలం సమీపంలో ఏర్పాటు విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏర్పడిన షార్ట్‌సర్క్యూట్‌తో రేగిన అగ్నికీలలు పొలంలో పడడంతో పంట దగ్ధమైంది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకునే లోగా పంట మొత్తం కాలిపోయింది. 18 క్వింటాళ్ల పప్పుశనగ నాశనమైంది. రెండు మూడు రోజుల్లో పంటకోత కోసే తరుణంలో ఇలాంటి నష్టం జరగిపోయిందని రైతు నాగేష్ కన్నీరు మున్నీరయ్యాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

బాధితురాలికి రూ.2 లక్షల ఆర్థిక సాయం

అనంతపురం అర్బన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఘటనలో తీవ్రంగా గాయపడిన కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన శ్రీదేవికి మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబరు ఎంఎస్‌రాజు రూ.2 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ మేరకు గురువారం అనంతపురంలోని తన నివాసంలో బాధితురాలికి చెక్కును ఆయన అందజేశారు. బాధితురాలు, కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి, టీటీడీ పాలక మండలికి కృతజ్ఞతలు తెలిపారు.



బాధితురాలికి రూ.2 లక్షల చెక్కు, అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



రహదారి పనులను పరిశీలిస్తున్న సమాజసేవకుడు ఆంజినప్ప

తలకాయలబెట్టకు సిద్ధమవుతున్న రహదారి

శిడ్లఘట్ట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని పాపాఘ్ని నదికాలువకు అనుబంధంగా ఉండే తలకాయలబెట్టపై భూనీళా శ్రీదేవి సమేత వెంకటరమణ స్వామి ఆలయం నెలకొని ఉంది. కొండపై చేరేందుకు భక్తుల సౌకర్యార్థం స్థానిక సమాజ సేవకుడు పుట్టుఆంజినప్ప శాశ్వత రహదారి కల్పించే పనులు చేపట్టారు. కొండపైకి చేరేందుకు మెట్ల మార్గం మాత్రమే ఉంది. ఈ తరుణంలో కొండపైకి వెళ్లేందుకు 3 కిలోమీటర్ల మేర రోడ్డును అభివృద్ధి చేస్తున్నారు. రోడ్డు నిర్మాణ పనులను స్థానిక ప్రముఖులతో కలసి ఆంజినప్ప గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో తిరుపతిగా పేరొందిన పుణ్యక్షేత్రానికి చేరుకునేందుకు తన వంతుగా 40అడుగుల విస్తీర్ణంతో సుమారు మూడు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. 2025 జనవరి 1న ప్రారంభమైన పనులు ముగింపుదశకు చేరుకున్నాయన్నారు. రోడ్డు పరిశీలనలకు ముందు ఆయన ఆలయంలో పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ అధ్యక్షుడు వెంకటస్వామి, సభ్యులు కృష్ణారెడ్డి, అశ్వత్‌రెడ్డి, నారాయణరెడ్డి, సీతహళ్ళి మంజునాథ్, ఆటగొల్లహళ్ళి నారాయణరెడ్డి, ఎస్ దేవగానహళ్ళి గ్రామపంచాయతీ సభ్యులు మంజునాథ్, రమేశ్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

పురందర దాస కీర్తనలు గొప్పవి

విద్వాన్ డాక్టర్ ఆర్‌కే పద్మనాభ




ప్రసంగిస్తున్న విద్వాన్ డాక్టర్ ఆర్‌కే పద్మనాభ

ముళబాగిలు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక సంగీత విద్వాంసులు పురందరదాస రచించిన కీర్తనలు అత్యంత గొప్పవని, కర్ణాటక శాస్త్రీయ సంగీతానికి వన్నె తెచ్చారని విద్వాన్ డాక్టర్ ఆర్‌కే పద్మనాభ తెలిపారు. పట్టణంలోని హరిదాస పీఠంలో పురందరదాస ఆరాధనలో భాగంగా గురువారం ఏర్పాటైన కార్యక్రమంలో నవరత్న కృతుల గోష్ఠిగాయనంలో పద్మనాభ పాల్గొని మాట్లాడారు. ఆధునిక సమాజ నిర్మాణానికి, ప్రజలలో చైతన్యానికి పురందరదాస కీర్తనలు బాటలు వేశాయన్నారు. శతాబ్దాలక్రితమే సంగీతం ద్వారా ప్రజలను చైతన్యం చేశారన్నారు. కాగా పురందర దాస ఆరాధనా సమితి సంస్థాపకులు ఎంఎన్ మూర్తి, ఎన్ రాజారావ్‌లు మనల్ని వీడినా వారి మార్గదర్శకంలో ఇప్పటి సమితి పదాధికారులు కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తుదిశ్వాస వరకు ఆరాధన కార్యక్రమాల్లో పాల్గొని తనవంతు సేవ చేస్తానన్నారు. తొలుత పురందర విఠల, పురందరదాస ప్రాకారోత్సవ సేవ, నాదస్వర సేవ నిర్వహించారు. అనంతరం కళాకారుల సంగీత సేవా కైంకర్యాలు, నృత్యసేవా కైంకర్య, నిపుణులైన కళాకారుల తాళవాద్య, యక్షగాన కార్యక్రమాలు భక్తులను అలరించాయి. సమితి ట్రస్టీ నరసింహప్రసాద్, మురళీధర్, ద్వారకనాథ్, సీవీ నాగరాజ్, విష్ణుకుమార్, వసుందరదేవి రామన్, జయంతి చంద్రమౌళి, గాయత్రి రంగనాథరావ్, మధుసూధన్ పాల్గొన్నారు.

మహిళా పోలీస్ స్టేషన్‌ను తరలించరాదు

దొడ్డబళ్ళాపుర, జనవరి 30(ఆంధ్రజ్యోతి): దొడ్డబళ్ళాపుర పట్టణంలో కొనసాగుతున్న మహిళా పోలీస్‌స్టేషన్‌ను బెంగళూరుకు తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. పోలీస్‌స్టేషన్‌ను తరలించరాదని కోరుతూ రాష్ట్ర కార్యనిరత పాత్రికేయుల సంఘం సభ్యులు దొడ్డబళ్ళాపుర డీఎస్పీ రవికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం సంఘం బెంగళూరు గ్రామీణ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రమేశ్ మాట్లాడుతూ తాలూకాలో రోజురోజుకు కుటుంబ కలహాలు అధికమయ్యాయని, మహిళలపై దౌర్జన్యాలు అధికమయ్యాయన్నారు. ఇటువంటి తరుణంలో మహిళా పోలీస్‌స్టేషన్‌ను మార్పు చేయాలని నిర్ణయించడం సరికాదన్నారు. మహిళా పోలీస్‌స్టేషన్‌ను దొడ్డబళ్ళాపురలోనే కొనసాగించేలా కోరుతూ డీఎస్పీకి విన్నవించామన్నారు. దొడ్డబళ్ళాపుర తాలూకా కార్యనిరత పాత్రికేయుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ డి ఉప్పార్ మాట్లాడుతూ దొడ్డబళ్ళాపురలో ఏర్పాటు కావాల్సిన ఆర్టీఓ కార్యాలయం, జిల్లా ప్రధాన పోస్టల్ కార్యాలయం, కేఎస్ఆర్టీసీ డిపో వంటి ఇతర కార్యాలయాలు పక్క తాలూకాకు వెళ్లాయన్నారు. ప్రజల అనుకూలం ఏర్పాటు చేసిన మహిళా పోలీస్ స్టేషన్‌ను కూడా తరలించాలనుకోవడం సరికాదన్నారు. మహిళా పోలీస్‌స్టేషన్ సొంత భవనానికి అవసరమయ్యే సొంత స్థలానికి పలుచోట్ల భూమి ఉందని తగిన స్థలాన్ని గుర్తించి శాశ్వత చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. డీఎస్పీ రవి మాట్లాడుతూ మహిళా పోలీస్‌స్టేషన్ స్థల మార్పు అంశం మౌఖికంగా తెలిసిందని, స్థానికుల డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తెస్తానన్నారు. ఈ సందర్భంగా కార్యనిరత పాత్రికేయుల సంఘం ఉపాధ్యక్షుడు కొత్తూరప్ప, ప్రధాన కార్యదర్శి చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1616.90	1,587.10
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	9,500	320
నీటి నిల్వ (టీఎంసీలు)	54.25	9.60

టీటీడీ సమాచార కేంద్రం ఏర్పాటు చేయండి



టీటీడీ చైర్మన్‌ను సన్మానిస్తున్న గారిపాటి రామకృష్ణ

కంప్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని ఆంధ్రులు కేంద్ర స్థానమైన సింధనూరులో టీటీడీ సమాచార కేంద్రం ఏర్పాటు చేసి సహకరించాలని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు కోరినట్లు అఖిల కర్ణాటక కమ్మ సంఘం అధ్యక్షుడు గారిపాటి రామకృష్ణ తెలిపారు. టీటీడీ చైర్మన్‌ను హైదరాబాద్‌లో కలసినట్లు తెలిపారు. బళ్లారి, రాయచూరు, కొప్పాళ, సింధనూరు, కంప్లి, కుడితిని, సిరుగుప్ప తదితర పట్టణాల పరిధిలో ఎక్కువగా ఆంధ్రులు క్యాంపులలో ఉంటున్నారన్నారు. వారు తిరుమల దర్శించుకునేందుకు పది లక్షల మందికి పైగా వెళతారన్నారు. ఇక్కడ కళ్యాణమండపం, సమాచార కేంద్రం ఏర్పాటు చేసినట్లయితే అందరికీ అనుగుణంగా ఏర్పాటు చేయాలని కోరారు. గతంలోనే రాజమండ్రిలో టీటీడీ సభ్యులు రామకృష్ణను కలిసి ఈ విషయంపై చర్చించినట్లు తెలిపారు.

డీఎల్డీ బ్యాంకు అధ్యక్షుడిగా వేమన్న



అధ్యక్షుడిని సన్మానిస్తున్న సభ్యులు

కంప్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): హొస్పేట తాలుకా డీఎల్డీ బ్యాంకు అధ్యక్షుడిగా బుక్కసాగరకు చెందిన అమ్మాజీ హేమన్న నాలుగోసారి ఎన్నికయ్యారు. 12 మంది సభ్యులు ఉండగా ఎవరూ పోటీ చేయకపోవడంతో వారినే ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి రవి కుమార్ తెలిపారు. అనంతరం గెలుపొందిన అమ్మాజీ హేమన్నకు, సభ్యులకు అభినందించి సన్మానించారు. అనంతరం అమ్మాజీ హేమన్న మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచే మరోసారి అధ్యక్షుడిగా ఎన్నుకున్నారన్నారు. రైతులకు, బ్యాంకు ఖాతాదారులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సభ్యులు మూకయ్య స్వామి, గంగాధర గౌడ, శంకరప్ప, కార్యదర్శి నటరాజు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి పట్ల ఆందోళన వద్దు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు

కంప్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): క్షయ రోగులు ఆందోళన చెందవద్దని పురసభ ముఖ్య అధికారి దుగ్గన్న తెలిపారు. కంప్లి పురసభ కార్యాలయంలో క్షయరోగ జాగృతి ఏర్పాటు చేశారు. క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించే పత్రికలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ క్షయ రోగులు ప్రభుత్వం చికిత్సతో పాటు సదుపాయాలు కల్పిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మేనేజర్ ప్రశాంత్, శోభ, బసవరాజు, రమేష్, జ్యోతి, మేఘన పాల్గొన్నారు.

ఆ ఇద్దరూ తలో దారి..!

- నాయకులు, కార్యకర్తలు ఎటువైపు?
- తారస్థాయికి గాలి, శ్రీరాములు మధ్య విభేదాలు



మాజీ మంత్రి శ్రీరాములు

బళ్లారి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): బళ్లారికి చెందిన బీజేపీ అగ్రనాయకులు గాలి జనార్ధన్‌రెడ్డి, బీ శ్రీరాములు మధ్య తలెత్తిన విభేదాలు తారస్థాయికి చేరాయి. ఆరోపణలు, ప్రత్యారోపణలతో గత కొన్ని రోజులుగా జిల్లాలో వారు చర్చనీయాంశంగా మారారు. సండూరు ఉప ఎన్నికల్లో శ్రీరాములు బీజేపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయలేదని గాలి జనార్ధన్‌రెడ్డి బాహాటంగా విమర్శలు గుప్పించారు. పార్టీ ముఖ్యనాయకులకు దీనిపై ఫిర్యాదు కూడా చేసినట్లు పార్టీలో చర్చ సాగింది. అయితే వారి అనుచరులు, మద్దతుదారులు ఎటువైపు వెళ్లాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఒకప్పుడు వీరి స్నేహం విడదీయడం ఎవరి తరం కాదు అనుకునేంతగా చేతులు వేసుకుని తిరిగారు. ప్రస్తుతం సీన్ రివర్స్ అయింది. వీరి స్నేహం ఇంతగా చెడిపోయిందా..? అనే విధంగా దూరమయ్యారు. గడిచిన ఆరేడేళ్లుగా వీరి మధ్య విభేదాలు మాత్రమే ఉండేవి. సండూరు ఉప ఎన్నికల కారణంగానే వీరు విడిపోయారని తెలుస్తోంది. ఒక దశలో నీవెంత అంటే నీవెంత అనే మాటల వరకూ వెళ్లారు. అంతటితో ఆగలేదు. గాలి జనార్ధన్‌రెడ్డికి కొందరు మద్దత్తు ఇస్తే శ్రీరాములకూ కొందరు అండగా నిలిచారు. శ్రీరాములు వర్గం వారు వాల్మీకులను జనార్ధన్‌రెడ్డి కించపరిచే విధంగా మాట్లాడారని బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అంతటితో ఆగకుండా ఏకంగా వాల్మీకి నాయకుడు శ్రీరాములుపై జనార్ధన్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. ఇలా గత వారం రోజులుగా ఎక్కడ చూసినా బళ్లారితో పాటు కర్ణాటకలో శ్రీరాములు, గాలి జనార్ధన్‌రెడ్డి మధ్య జరిగిన మాటల యుద్ధం గురించే చర్చ సాగుతుంది.



ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి

ఎవరి వైపు ఉండాలో..?

ఈ ఇద్దరి స్నేహం బాగా ఉన్న రోజుల్లో కథ వేరు ఇప్పుడు వేరు. ఇద్దరి మధ్య తలెత్తిన విభేదాలు కారణంగా ఎటు వైపు వెళ్లాలో తెలియక కొందరు సీనియర్ బీజేపీ నాయకులు, కార్యకర్తలు అయోమయంలో పడ్డారు. మరి కొందరు ఇద్దరి దగ్గరకూ వెళ్లకుండా దూరంగా ఉంటున్నారు. సీనియర్ కార్యకర్తలు మాత్రం ఈ ఇద్దరు ఉంటే ఏంటీ పోతే ఏంటీ మాపని మాదే అని పార్టీ కార్యకలాపాల్లో పాల్గొంటున్నారు.

వేడుకలకు శ్రీరాములు వర్గం దూరం

బీజేపీ బళ్లారి జిల్లా అధ్యక్షుడుగా రెండోసారి అనీల్ నాయుడు ఎన్నికయ్యారు. ఇందుకు సంబంధించి బుధవారం బీజేపీ కార్యాలయంలో అభినంద సభను ఏర్పాటు చేశారు. ఇందులో కేవలం గాలి జనార్ధన్‌రెడ్డితో పాటు ఆయన మద్దతు దారులు పాల్గొన్నారు. శ్రీరాములు, ఆయన వర్గీయులు రాలేదు. దీనితో పార్టీలో కూడా చర్చసాగుతోంది.

క్షయ రహిత జిల్లాగా మారుద్దాం

- డీసీ ప్రశాంత్‌కుమార్, డాక్టర్ ఇంద్రాణి

బళ్లారి సిటీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాను క్షయ రహిత జిల్లాగా మార్చేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, క్షయవ్యాధి నిర్మూలన అధికారి డాక్టర్ ఇంద్రాణి అన్నారు. జిల్లాపాలన యంత్రాంగం, జిల్లాపంచాయితీ, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, తారానాథ్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల, ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం జిల్లా పాలనా నూతన భవనం ఆవరణలో నిర్వహించిన క్షయ వ్యాధి అవగాహన జాతాను కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. ఇప్పటికే నగరంలోని విమ్స్, జిల్లాఆసుపత్రుల్లో సిబినాట్, ట్రూనాట్ మిషన్లు ఉన్నాయని, వ్యాధిని గుర్తించేందుకు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో కూడా అమలు చేశామన్నారు. దీనివల్ల క్షయ వ్యాధిగ్రస్తులకు ముందస్తుగా గుర్తించి చికిత్స అందించవచ్చని తెలిపారు. జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమాధికారి రమేశ్‌బాబు, ఆయుష్ అధికారిణి డా. సరళాదేవి, తారానాథ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాదవ, సహాయ పరిపాలనాధికారి శ్రీనివాస్, డాక్టర్లు పెద్ద బసప్ప, కొట్రేశ్, రాజేశ్, రవిచవాన్, శివ, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులపై నిరంతరం నిఘా ఉంచాలి: గర్భిణులపై నిరంతరం నిఘా ఉంచి మాతా శిశు మరణాల నివారణకు వైద్యాధికారులు చొరవ చూపాలని కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా అన్నారు. నగరంలోని కలెక్టరేట్ హాల్లో



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు



ర్యాలీని ప్రారంభిస్తున్న డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

గురువారం ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి మాతా శిశు మరణాల నివారణపై శాఖల అంతర్ సమన్వయ కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించి కలెక్టర్ మాట్లాడారు. రక్త హీనత, పౌష్టికాహారంలేక పోవడం, ఐరన్ మాత్రల వినియోగం గురించి ఆశాకార్యకర్తలు గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మాతాశిశు సంరక్షణ గురించి కుటుంబ సభ్యులకు వివరించాలన్నారు. పంచాయతీ సీఈఓ రాహుల్ శరణప్ప మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా ప్రసవం తర్వాత చిన్నపాటి అనారోగ్య సమస్యలు వచ్చినా సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. రోజువారీ మందులు మాత్రమే సిఫార్సు చేయవద్దని వైద్యులకు సూచించారు. జిల్లాలోని ఆరోగ్య కేంద్రాల్లో ప్రతినెలా 9, 24 తేదీల్లో గర్భిణులకు భోజనంతోపాటు పౌష్టికాహారం అందించడంపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి రమేశ్‌బాబు, సర్జన్ బసారెడ్డి, ఆర్సీహెచ్ అధికారి హనుమంతప్ప, డీసీజ్ కంట్రోల్ అధికారి డా.అబ్దుల్లా, కుటుంబ సంక్షేమ అధికారి పూర్ణిమ కట్టిమనె, డా. మరియంబి, క్షయవ్యాధి నియంత్రణ అధికారి డా. ఇంద్రాణి, బిమ్స్ నిపుణులు డా. చంద్రశేఖర్, డా.శ్రీకాంత్, జిల్లా ఆరోగ్య విద్యాశాఖాధికారి ఈశ్వర దాసప్పనవర్ పాల్గొన్నారు.

మిర్చికి మద్దతు ధర ప్రకటించాలి

బళ్లారి సిటీ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): నగరంలో ఎండు మిర్చి మార్కెట్ ఏర్పాటు చేసి, మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఏఐకేకేఎంఎస్ రైతు సంస్థ డిమాండ్ చేసింది. నగరంలో గురువారం జాతా నిర్వహించి ప్రభుత్వానికి వినతి ప్రతం సమర్పించింది. గాంధీభవన్ నుంచి జాతా ప్రారంభమై గడిగి చెన్నప్ప సర్కిల్ వద్ద మిర్చి మార్కెట్ ప్రారంభించాలని రైతులు నినాదాలు చేశారు. మిర్చికి ఇతర పంటల మాదిరిగానే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. అనంతరం జిల్లాకలెక్టర్ కార్యాలయానికి చేరుకుని రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన వినతిపత్రాన్ని జిల్లా యంత్రాంగానికి సమర్పించింది. జిల్లాధ్యక్షుడు గోవింద్ మాట్లాడుతూ.. ఈఏడాది మిర్చిపంటను సాగు చేసేందుకు రైతులు ఎకరాకు రూ.1.5 నుంచి 2 లక్షల వరకు ఖర్చు చేశారని, గత నెలలో కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మిర్చి బ్లాక్ స్పాట్ వ్యాధిబారిన పడిందన్నారు. మార్కెట్‌లో క్వింటాల్ మిర్చి రూ.8000 నుంచి రూ.11వేలకు కొనుగోలు చేస్తున్నారన్నారు. దీంతో రైతులకు గిట్టుబాటుకాక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. నాలుగైదేళ్లుగా మిర్చి ధర దారుణంగా పడిపోవడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందన్నారు. పంట కోసం చేసిన అప్పులు తీర్చలేకపోతున్నారన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐకేకేఎంఎస్ నాయకులు

ప్రభుత్వం వెంటనే స్పందించి మిర్చి పంటకు కనీస మద్దతు ధర నిర్ణయించి బళ్లారిలో మిర్చి మార్కెట్ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గురల్లి రాజా, హనుమంతప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు బసన్న, ధనరాజ్, జిల్లాకమిటీ సభ్యుడు హొన్నూరప్ప పాల్గొన్నారు.



జిల్లా కోర్టు ఆవరణలో పిచ్చిమొక్కలను ఏరివేస్తున్న న్యాయాధికారులు

పరిశుభ్రతకు ప్రాధాన్యం

- న్యాయాధికారి సిద్ధలింగ ప్రభు

బళ్లారి సిటీ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రిన్సిపల్ ఫ్యామిలీ కోర్టు న్యాయాధికారి సిద్ధలింగ ప్రభు అన్నారు. జాతీయ స్వచ్ఛత దినోత్సవంలో భాగంగా గురువారం నగరంలోని తాలూరు రోడ్డు వద్దనున్న నూతన కోర్టు ప్రాంగణంలో పశుభ్రత పనులు చేపట్టారు. న్యాయాధికారులు, సిబ్బంది కోర్టు ఆవరణాన్ని శుభ్రం చేశారు. న్యాయాధికారి సిద్ధలింగ ప్రభు మాట్లాడుతూ మహాత్మాగాంధీ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ స్వచ్ఛతా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం అదనపు సెషన్స్ న్యాయాధికారి విద్యాధర శిరహట్టి మాట్లాడుతూ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు శుభ్రత పనులు చేపట్టామన్నారు. సివిల్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన, నాణ్యమైన జీవితంలో పరిశుభ్రత అంతర్భాగమని, మనందరం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం అన్నారు. కార్యక్రమంలో న్యాయాధికారులు రాఘవేంద్రగౌడ, ప్రమోద్, వాసుదేవ, రాధాకాంత్‌గుడి, ఇబ్రహీం ముజావర్, అపర్ణ, అమిత్, ఈరప్ప, రూప, ముదుకప్ప, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జాతిపితకు ఘన నివాళి



గాంధీజీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

బళ్లారి సిటీ,జనవరి 30(ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రాణత్యాగం చేసిన శాంతి దూత జాతిపిత మహాత్మగాంధీ అని కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం బళ్లారి జిల్లా యూనిట్ అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి అన్నారు. గురువారం తాలూకాలోని సంజీవరాయకోట ప్రభుత్వపాఠశాలలో గాంధీజీ 77వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఆరునెలలోపే గాంధీజీ నాథూరాంగాడ్సే కాల్పులకు బలి కావడం దురదృష్టకరమన్నారు. ఉపాధ్యాయులు దిల్షాద్ బేగం ప్రతిభ కనబరిచిన పిల్లలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చన్నమ్మ, సుమతి, వైశాలి, శ్వేత, ఉమ్మేహానీ, శాశమ్మ, రామాంజనేయ, గురుప్రసాద్, విజయ,విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పురందర దాస ఆరాధనోత్సవం



పురందర దాస చిత్రపటానికి పూజలు చేస్తున్న భక్తులు

బళ్లారి సిటీ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): దాస సాహిత్య, సంగీత రంగాల ద్వారా అధ్యాత్మిక వారసత్వానికి పురందరదాస విశేష కృషి చేశారని కన్నడ సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు సిద్ధలింగేశ్ రంగన్ననవర్ అన్నారు. బుధవారం సాయంత్రం హంపిలో మంత్రాలయ పురందర మంటపంలో జిల్లాపరిపాలన, కన్నడ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరాధనోత్సవంలో పురందరదాస చిత్రపటానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో ఆరాధనోత్సవాలు నిర్వహిస్తారన్నారు. పురందరదాస ఆశయాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని, ఆయన సందేశాలు కాలానుగుణమైనవని అన్నారు. పురందర మండపం నుంచి విజయ విఠల దేవాలయం వరకు స్వామివారి చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మంత్రాలయ గురుసార్వభౌమ దాస సాహిత్య ప్రాజెక్టు విద్వాన్ సులాది హనుమేశ్ ఆచార్య పురందర దాస కీర్తనలపై ప్రత్యేక ఉపన్యాసం చేశారు. కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ రాజకుటుంబానికి చెందిన ఆనెగుంది కృష్ణ దేవరాయ, శ్రీరాఘవేంద్రస్వామి మఠం హొసపేట విభాగం వ్యవస్థాపక గురురాజ్ దిగ్గావి, మఠాధికారి పవన్ ఆచార్య, అర్చక నరసింహ ఆచార్య, గురురాజ్, సిందనూరు దేశాయి, గురురాజ్ కులకర్ణి, మారుతి ఆచార్య మంత్రాలయ శ్రీరాఘవేంద్ర స్వామి, దాస సాహిత్య జిల్లా సంచాలకుడు పద్మనాభ పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లు పనుల్లో నాణ్యత పాటించాలి

- పీడబ్ల్యూడీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హేమరాజ్



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఈఈ హేమరాజ్, కమిషనర్ ఖలీల్‌సాబ్

బళ్లారి గాంధీనగర్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్లు పనుల్లో నాణ్యత పాటించాలని ప్రజా పనుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హేమరాజు కాంట్రాక్టర్లను ఆదేశించారు. గురువారం పోలీసు జింఖానాలో ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గతంలో మాదిరిగా కాంట్రాక్టర్ల పరిస్థితి బాగాలేదనే విషయం అందరికీ తెలిసిందేనని, ప్రభుత్వం నిధుల విడుదలలో ఆలస్యమవుతున్న నేపథ్యంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు ఏళ్ళతరబడి బిల్లులు పెండింగ్‌లో ఉంటున్నాయన్నారు. ఒకవైపు అభివృద్ధి పనులు, మరోవైపు కాంట్రాక్టర్ల బిల్లులు సమస్యలతో ఇంజనీర్లపై ఒత్తిడి పెరుగుతోందన్నారు. ఇతర జిల్లాలతో పోలిస్తే బళ్లారిలో ఉన్న సివిల్ కాంట్రాక్టర్లు ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయంతో అభివృద్ధి పనులకు సహకరిస్తుండటం హర్షించదగ్గ విషయమన్నారు. కాంట్రాక్టర్లు పనులు చేసే సమయంలో సాంకేతిక పరమైన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ ఖలీల్ సాబ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఈ ఇందూధర్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఈఈ వీరేష్‌లతో పాటు సబ్‌డివిజన్ ఏఈఈ సుదర్శన్ రెడ్డి, కార్పొరేషన్ ఇంజనీర్ మంజునాథ్, జిల్లా కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడు ఎస్.జి. రమణారెడ్డి(రవి), కార్యదర్శి ఎం.చంద్రశేఖర్ గౌడ పాల్గొన్నారు.

హోసూరు జోన్

పంచాయతీల విలీనానికి వ్యతిరేకంగా నిరసన

హోసూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్‌లో పంచాయతీల విలీనానికి వ్యతిరేకంగా తమిళనాడు రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నల్లూరు, మడివాళం, నల్లూరు, అగ్రహారం, బాగలూరులను హోసూరు కార్పొరేషన్‌లో విలీనం చేయడాన్ని నిరసిస్తూ తమిళనాడు రైతు సంఘం తరపున నిరసన చేపట్టారు. నిరసనకు సంఘం కృష్ణగిరి జిల్లా అధ్యక్షులు శ్రీరామరెడ్డి అధ్యక్షత వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ చిన్నస్వామి ప్రధాన ప్రసంగం చేశారు. తమిళనాడు ప్రభుత్వం హోసూరు కార్పొరేషన్‌కు సమీపంలోని కొన్ని పంచాయతీలలోని గ్రామాలను జోడించడం ద్వారా హోసూరు కార్పొరేషన్‌ను విస్తరించాలని ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం నల్లూరు పంచాయతీలోని నల్లూరు, మడివాళం గ్రామాలను, బీకేపల్లి పంచాయతీలోని నల్లూరు అగ్రహారం, బాగూరు గ్రామాలను హోసూరు కార్పొరేషన్‌లో చేర్చనున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో రైతులు, గ్రామస్థులు పూర్తిగా వ్యవసాయ కూలీ పనులపై ఆధారపడి జీవిస్తున్నారు. కార్పొరేషన్‌లో కలపడం ద్వారా అభివృద్ధి పేరుతో సాగు భూములు ఇవ్వాల్సి ఉంటుందని, తద్వారా తమ జీవనోపాధి కోల్పోతామన్నారు. ఇంటిపన్ను భూమిపన్ను, నీటిపన్ను ఇలా ఎన్నో రెట్లు పెరుగుతాయన్నారు. భూముల రిజిస్ట్రేషన్ విలువ పెరిగి పేద రైతులు, గ్రామస్థులు భూమిని అమ్ముకోవాలన్నా, కొనాలన్నా ఇబ్బందులు ఉంటాయన్నారు. నిరసనలో చిక్కన్న నరసింహమూర్తి, చంద్రశేఖర్, గిరిజమ్మ నారాయణప్ప, ప్రసన్న, రమేశ్,నాగరాజు, వెంకటేశ్, మారప్పగౌడు, నల్లూరు గ్రామ రైతులు, ప్రజలు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న రైతుసంఘం సభ్యులు

ఎంపీ, ఎమ్మెల్యేల తీరుపై ఆగ్రహం.. ఆందోళన



ఆందోళన చేస్తున్న అఖిలభారత హిందూ మహాసభ కార్యకర్తలు

హోసూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు చైర్మెన్, ఎంపీ నవాజ్‌గని, మనపరై ఎమ్మెల్యే తిరుపరంగుండ్రం కొండపై ఉన్న సికిందర్ దర్గాను సందర్శించిన వేళ మురుగన్ ఆలయం కొండపై మాంసాహారం సేవించారనే సమాచారంతో తమిళనాడు వ్యాప్తంగా హిందూ మహాసభ నిరసనలు తెలుపుతోంది. హోసూరు రామ్‌నగర్‌లోని అన్నా విగ్రహం దగ్గర అఖిల భారత హిందూ మహా సభ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అఖిల భారత హిందూ మహాసభ యువజన రాష్ట్రకార్యదర్శి రాజేశ్ అధ్యక్షత వహించారు. సుబ్రమణ్య స్వామి ఆరు గృహాలలో మొదటిది అయిన తిరుపరంగుండ్రం హిందువులకు అత్యంత ముఖ్యమైన పవిత్ర స్థలాలల్లో ఒకటి. తిరుపరంగుండ్రం కొండను మురుగన్ కొండ అని పిలుస్తారు. మదురై, కంచి వంటి పరిబాద్‌లో సంఘ సాహిత్యంలో దీని విశేషాల గురించి పాటలు ఉన్నాయి. తమిళ రాజుల పాలన నుంచి నేటి తరాల వరకు అనేక పరిపాలన పత్రాలు కూడా ఉన్నాయి. నిరసనలో పాల్గొన్న 34మంది ఆందోళనకారులను హోసూరులో బందోబస్తులో ఉన్న ఇన్‌స్పెక్టర్ నాగరాజు నేతృత్వంలో అరెస్టు చేశారు.

మహాత్ముడి ఆశయాలు కొనసాగిద్దాం



ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాఐక్య వేదిక సభ్యులు

హోసూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): గాంధీ మహాత్ముడి ఆశయాలను కొనసాగిద్దామని పలువురు వక్తలు అన్నారు. నగరంలోని గాంధీ విగ్రహానికి తమిళనాడు ప్రజా ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. సంఘం అధ్యక్షుడు సేదుమాదవన్ ఆధ్వర్యంలో సమైక్య తమిళనాడు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం డీఎంకే కార్యవర్గ సభ్యురాలు ఎల్లోరమణి, ద్రావిడ కళగం జిల్లా అధ్యక్షుడు వనవేందన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మురళీధరన్, సీపీఎం జిల్లా కార్యదర్శి సురేశ్ ప్రసంగించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు నటరాజన్ సహ పలువురు వివిధ పార్టీల కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు.

కేంద్ర మాజీ మంత్రికి నివాళి

హోసూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కుగ్రామాన్ని పారిశ్రామిక నగరంగా తీర్చిదిద్దిన కేంద్ర మాజీ మంత్రి సి.సుబ్రహ్మణ్యం జయంతిని పురస్కరించుకుని గురువారం సి.సుబ్రహ్మణ్యం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తమిళనాడులో అత్యంత వెనుకబడిన ప్రాంతంగా ఉన్న ఉమ్మడి ధర్మపురి జిల్లాలోని హోసూరులో కేంద్ర మంత్రిగా పనిచేసిన సి.సుబ్రహ్మణ్యం టీవీఎస్ అశోక్‌లైలాండ్, మొదటి సిప్‌కాట్, రెండో సిప్‌కాట్‌ను హోసూరులో ఏర్పాటు చేశారు. గురువారం ఆయన జయంతి సందర్భంగా సిప్‌కాట్ ఏరియాలోని ప్రైవేట్ ఇండస్ట్రియల్ రోడ్‌లోని ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే, కౌన్సిల్ సభ్యుడు కాంగ్రెస్ పార్టీ పశ్చిమ జిల్లా ఇన్‌చార్జి మనోహరన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ కార్యదర్శి సత్యమూర్తి, కాంగ్రెస్ పార్టీ హోసూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నెర్లికర్, వ్యాపారవేత్త ఆది తదితరులు పాల్గొన్నారు.